క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు ఎస్పీ అభినందన



శ్రీ జశ్వంత్ చంద్రను అభినందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: సివిల్స్ ఫలితాల్లో 162వ ర్యాంకు సాధించిన కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన జీను శ్రీ జశ్వంత్ చంద్రను ఎస్పి సతీషకుమార్ సహా అదనపు ఎస్పీలు సత్యనారాయణ, భాస్కర రావు అభినందించారు. ఈ మేరకు, సోమవారం జశ్వంత్ చంద్ర కుటుంబసభ్యులతో కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిశారు. ర్యాంకు ఆధారంగా ఐపీఎస్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని జశ్వంత్ ఎస్పీకి తెలిపారు. దీంతో ఐపీఎస్‌గా ఉండే బాధ్యతలు, నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. పోస్టింగ్ ఎక్కడ వచ్చినా పూర్తి సమర్థతతో విధులు నిర్వర్తించి స్వగ్రామానికి, తల్లిదండ్రులకి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వాకలపూడి సెక్షన్ పరిధిలోని నేషనల్ హై వే పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు. తిమ్మాపురం సబ్ స్టేషన్ నుంచి 11కేవీఏ వాకలపూడి ఫీడర్ పరిధిలో అచ్చంపేట జంక్షన్, ఏడీబీ రోడ్డు, కొత్తూరు జంక్షన్, రాయుడుపాలెం, కిరణ్ కంటి ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

రెండో దశ ర్యాండమైజేషన్



రెండో దశ ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్ నివాస్, జిల్లా ఎన్నికల పరిశీలకులు

కాకినాడ సిటీ: ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్‌ను సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె నివాస్, జిల్లా పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్ సమక్షంలో నిర్వహించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పీవో, ఏపీవో, ఓపీవో, రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా వివిధ నియోజకవర్గాల్లో విధులు కేటాయించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, సీపీవో పి.త్రినాథ్, ఎన్ఐసీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బారావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమకాలీన ఉపన్యాసాల అధ్యయనం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన పోలా భాస్కర్ తదితరులు

కాకినాడ సిటీ: స్థానిక పీఆర్ కళాశాల అధ్యాపకుడు పి.హరిరామ్‌ప్రసాద్ రచించిన సమకాలీన ఉపన్యాసాల మనో సామాజిక అధ్యయనం పుస్తకాన్ని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ తదితరులు సోమవారం న్యూ ఢిల్లీలో జవహర్ లాల్ విశ్వ విద్యాలయంలో ఆవిష్కరించారు. సమకాలీన అంశాలపై మరిన్ని రచనలు విలువల ఆధారంగా రావాలన్నారు. పుస్తక రచయిత హరిరామ్‌ప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు రవికేష్, రవిరమేష్ చంద్ర తదతరులు పాల్గొన్నారు.

14 మంది వలంటీర్ల రాజీనామా

కరప: మండల పరిధిలో 14 మంది గ్రామ వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఎంపీడీఓ కె.అప్పారావుకు పత్రాలను సమర్పించారు. దీంతో మండలంలో వలంటీర్ల రాజీనామా 24కు చేరుకుంది. కరప-1 నుంచి గీసాల ప్రమీలాదేవి, కొరిపల్లి నుంచి వాసంశెట్టి నాగలక్ష్మి, దెయ్యాల వైదేహి, కడియాల నూకాదేవి, సమనాసి శివచంద్ర పవన్‌కుమార్, సిరిపురం నుంచి మందపల్లి లోవకుమార్, కత్తుల సతీష్‌కుమార్, పరిశిపోగుల వెంకటరమణ, యండమూరు నుంచి వనుం రేవతి, మార్నెళ్ల అరవింద్, వేములవాడ నుంచి అనుసూరి సతీష్, మేడిశెట్టి లోవరాజు, వాసంశెట్టి వెంకటకిరణ్, కొమరపు వీరప్రసాదరావు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

కాకినాడ రూరల్‌లో షర్మిల రోడ్ షో

కాకినాడ రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల కాకినాడ రూరల్ పరిధిలో సోమవారం రోడ్ షో నిర్వహించారు. అచ్చంపేట జంక్షన్ మీదుగా రాయుడుపాలెం జంక్షన్, ఏపీఎస్పీ, సర్పవరం జంక్షన్, నాగమల్లితోట జంక్షన్ వరకు ఆమె ర్యాలీ సాగింది. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆమె ముందుకు సాగారు. ర్యాలీలో ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎంఎం పళ్లంరాజు, కాకినాడ రూరల్ అభ్యర్థి పిల్లి సత్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

'కూటమి' దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లండి
- రానున్న 13 రోజులూ అత్యంత కీలకం
- పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే ద్వారంపూడి





పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజకీయ లబ్ధికోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక డి కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన పార్టీ కన్వీనర్లు, గృహ సారథులు, డివిజన్ ఇన్‌చార్జిలతో సోమవారం క్లస్టర్ల వారీగా సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ద్వారంపూడి మాట్లాడుతూ ఓటమి భయంతో తెలుగుదేశం నేతలు వైఎస్సార్ సీపీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలను చూపిస్తూ వైఎస్సార్ సీపీపై బురద చల్లడమే లక్ష్యంగా సాగుతున్న ప్రచారాన్ని బలంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. క్షేత్రస్థాయిలో బలోపేతంగా ఉన్నందున కూటమి పార్టీల తప్పుడు ప్రచారాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

మేనిఫెస్టోపై ప్రచారం చేయండి

అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ద్వారంపూడి సూచించారు. 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోలోని ప్రతీ అంశాన్ని అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నామని, అదేరీతిలో 2024 మేనిఫెస్టో ఉన్నందున ప్రజల్లో విశ్వాసం కలిగించేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గత ఎన్నికల్లో నవరత్నాలను అమలు చేసిన రీతిలోనే ప్రస్తుత మేనిఫెస్టోను కూడా అమలు చేస్తామన్న భరోసా ప్రజల్లో కల్పించాలన్నారు.

రానున్న రోజులు కీలకం

రానున్న 13 రోజులు పార్టీకి అత్యంత కీలకమని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. బూత్‌స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ కనిపిస్తోందని, విజయం సాధించగలమన్న ధీమా ఉన్నప్పటికీ మంచి మెజార్టీ సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కష్టించి పనిచేయాలని ద్వారంపూడి కోరారు. పార్టీలో కష్టించి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని నాయకులంతా డివిజన్ల పరిధిలోని ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహ సారథులు, ఇతర ముఖ్య కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం సాధ్యం

- కూటమి అభ్యర్థుల మాటలు నమ్మొద్దు
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి
- పండూరులో ఎమ్మెల్యే కన్నబాబు
- పాల్గొన్న సినీ నటుడు గౌతమ్‌రాజు



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, నటుడు గౌతమ్‌రాజు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ఐదేళ్లుగా సంక్షేమ ప్రభుత్వాన్ని నడిపిన సీఎం జగన్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని పండూరు, తమ్మవరం, పెనుమర్తి గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనతో పాటు సినీ నటుడు గౌతమ్‌రాజు పాల్గొని ప్రచారంలో ఉత్సాహాన్ని నింపారు. ఐదేళ్ల సంక్షేమాన్ని అందించిన సీఎం జగన్ ఒక వైపు, కూటమి పార్టీలు మరో వైపు నిలిచాయన్నారు. ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా పాటించి, నవరత్న సంక్షేమ పథకాలను అమలు చేసిన జగన్ ఈ ఎన్నికల్లోను, గత పథకాలను కొనసాగిస్తూ మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. అన్నివర్గాల అభ్యున్నతితోపాటు యువతకు ఉద్యోగాలు కల్పించేలా మేనిఫెస్టోను రూపొందించారని, జనరంజక పాలన అందించాలంటే జగన్‌తోనే సాధ్యమన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలన్నారు. సినీ నటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేదల సంక్షేమాన్ని కోరుకుని పాలన సాగిస్తోందని, కూటమి పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన మాటలు నమ్మవద్దని, కన్నబాబును, సీఎం జగన్‌ను గెలిపించాలని కోరారు. ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, గ్రామ నాయకుడు ధర్మారావు, అజయ్, మాజీ మేయర్ పోసలపాటి సరోజ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంటి, రాంబాబు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ వెంకటరాజు, తమ్మవరం ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, పెనుమర్తి సర్పంచ్ పెంకె ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల వ్యయం నమోదు



అభ్యర్థుల వ్యయ నమోదు విభాగాన్ని సందర్శించిన వ్యయ పరిశీలకులు ఆసిఫ్

కాకినాడ: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆసిఫ్.ఎ ఆదేశించారు. సోమవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సిటీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కార్యాలయాన్ని రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఎన్నికల వ్యయాలు నమోదు చేసే విభాగాన్ని, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

కౌంటింగ్ సెంటర్ పరిశీలన

ఎన్నికల పరిశీలకుడు ఎస్.గణేష్ సోమవారం జేఎన్‌టీయుకే ఆవరణలోని సివిల్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజున తీసుకోవలసిన చర్యలు, కల్పించాల్సిన సదుపాయాలపై సూచనలిచ్చారు. ఇందుకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆర్వో జె.వెంకటరావు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, ఏఆర్వో చల్లన్నదొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ తదితరులు ఉన్నారు.

పోల్ పోరులో నిలిచింది 30 మంది

- సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో 15 మంది చొప్పున అభ్యర్థులు
- సిటీ పరిధిలో రెండు.. రూరల్ పరిధిలో మూడు ఉపసంహరణ
- గుర్తుల కేటాయింపుపై కసరత్తు



నగర నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి వెంకటరావు

కాకినాడ: మే 13న జరగనున్న ఎన్నికలకు కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సోమవారం సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య కొలిక్కి వచ్చింది. వాస్తవానికి 22 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఐదుగురి నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. 17 మంది పోటీలో మిగలగా సోమవారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసే సమయానికి ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 15 మంది పోటీలో మిగిలారు. వైఎస్సార్ సీపీ నుంచి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, టీడీపీ నుంచి వనమాడి వెంకటేశ్వరరావు, బీఎస్పీ నుంచి కంభం రాజుబాబు తదితరులతో పాటు పలు ఇతర పార్టీలకు, స్వతంత్రంగా 12 మంది పోటీలో నిలిచారు. జాతీయ, ముఖ్య పార్టీల గుర్తులపై స్పష్టత ఉన్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించిన గుర్తుల కేటాయింపుపై కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.,వెంకటరావు సోమవారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను, గుర్తులకు సంబంధించిన ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు నివేదించారు.

రూరల్ నియోజకవర్గ పరిధిలో..

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల రణరంగంలో కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తం 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అధికారులు ఇద్దరివి తిరస్కరించారు. దాంతో 18 నామినేషన్లు మిగిలాయి. సోమవారం ఉపసంహరణ గడువు కావడంతో ముగ్గురు వారి నామినేషన్లను వెనక్కు తీసుకున్నారు. దీంతో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో వైఎస్సార్ సీపీ నుంచి కురసాల కన్నబాబు, జనసేన నుంచి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాంగ్రెస్ నుంచి పిల్లి సత్యలక్ష్మితో పాటు పలువులు ఇతర పార్టీల నుంచి, స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. కాగా జనసేన, జాతీయ జనసేన పార్టీల అభ్యర్థుల పేర్లు వెంకటేశ్వరరావు కావడంతో ఎవరి ప్రభావం ఎవరిపై పడుతుందన్నది ఆసక్తిగా మారింది.

వైఎస్సార్ సీపీతోనే మహిళాభ్యుదయం



కొంగోడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మండల ఆహార సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యుదయమే ధ్యేయంగా గత ఐదేళ్లలో పాలనచేశారని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని మండల ఆహార సలహామండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కొంగోడులో మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, మహిళలతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాల పట్టాలు గురించి ఓటర్లకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి
- ఆరో డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



భర్త ద్వారంపూడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న మహాలక్ష్మి



తండ్రి ద్వారంపూడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ ప్రణీత

కాకినాడ: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు కాకినాడను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సేవలు గుర్తించి రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె 6వ డివిజన్ పరిధిలోని తోటమ్మవారి సందు, మున్సిపల్ కాలనీ, జ్యోతులవారి వీధి, అనుసూరి వారివీధి, డాల్ఫిన్‌కాలనీ ప్రాంతాల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడికి మద్దతుగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో సాధించిన ప్రగతిని వివరించే కరపత్రాలను ఆమె ఓటర్లకు అందజేశారు. నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమై కాకినాడ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులను ప్రజలు కూడా ఆదరించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ద్వారంపూడిని మరోసారి గెలిపించి మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ఆమె కోరారు. మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, పార్టీ యువ నాయకులు మల్లిపాముల గణపతి, కొంతం శ్రీనివాస్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

కుమార్తె ప్రచారం

స్థానిక 31 డివిజన్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాగంపేట రామాలయం నుంచి ఇంటింటికీ వెళ్లి తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 2019-24 మధ్య కాకినాడలో ఊహించని అభివృద్ధి జరిగిందని, ఇందుకు కారణమైన తండ్రిని మరోసారి వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ఆమె కోరారు. ఆమెకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంఘీభావం తెలియజేస్తూ పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలను అందుకున్నామని, తమ అభివృద్ధిని కాంక్షించిన వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కల్పించాలి

బోట్‌క్లబ్: పెట్రోల్ బంక్‌లలో కనీస సదుపాయాలు కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాటసారుల కోసం తాగునీటి వసతి, వినియోగదారులకు అందుబాటులో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఉచితంగా టైర్లలో గాలి నింపడం, ఆపద వేళ ఫోన్ సదుపాయం, ఫిర్యాదుల బాక్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్, పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు పరికరాలు ఉంచాల్సిన బాధ్యత వుందన్నారు. స్మార్ట్ సిటీ కాకినాడ జిల్లా కేంద్రంలో కొన్ని పెట్రోల్ బంకులు మినహా 90 శాతం వీటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలన్నారు. పెట్రోల్ బంక్ వద్ద లభించే సేవల బోర్డును ప్రతి బంకు వద్ద ఏర్పాటు చేయించాలని కోరారు.

చిన్నారులకు శాస్త్రీయ నృత్యం నేర్పాలి

బోట్‌క్లబ్: తల్లితండ్రులు తమ పిల్లలకు శాస్త్రీయ నృత్యాన్ని నేర్పాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం వాగ్దేవి నృత్య అకాడమి ఆధ్వర్యంలో నాట్య గురువులు కల్యాణి శిష్య బృందం నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకొంది. నృత్యం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడుతుందన్నారు. నాట్య గురువులు కల్యాణి మాట్లాడుతూ అడ్డాల సత్యనారాయణ కుమార్తె సత్య సాహితి కూచిపూడి నృత్య ప్రదర్శనలో రెండు పర్యాయాలు గిన్నీస్ రికార్డు సాధించిందన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తేజేశ్వరరావు, నృత్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరిక





రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరిన పగడాలపేట, తమ్మవరం కార్యకర్తలతో ఎమ్మెల్యే కన్నబాబు



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



కాకినాడ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద కన్నబాబు సమక్షంలో సోమవారం కాకినాడ రూరల్ తూరంగి పగడాలపేట, తమ్మవరం గ్రామాల కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. తూరంగి పగడాల పేట నుంచి ఆ గ్రామ నాయకులు గరికిన అప్పన్న ఆధ్వర్యంలో చొక్కా గంగాధర్, సూరాడ అడవయ్య, చొక్కా ప్రసాద్, మూసా సూరిబాబు, సూరాడ భైరవస్వామి, మూసా చిన్నారావు, సూరాడ రమణ, చొక్కా సతీష్, వాడముద్దల కోటయ్య తదితరులు టీడీపీ నుంచి చేరారు. కార్యక్రమంలో పంపనబోయిన రామకృష్ణ, మోసా సాయి, తదితరులు పాల్గొన్నారు. అలాగే తమ్మవరం గ్రామం నుంచి కొప్పిశెట్టి అప్పలరాజు, ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు ఆధ్వర్యంలో సవరం రాజబాబు, మార్నెళ్ల సత్యనారాయణ, బొడ్డు సత్యనారాయణ, సిద్ధాంతపు నాగేశ్వరరావు, సవరం అప్పారావు, సత్తిబాబు, మార్నెళ్ల శాంతమ్మ, బద్దా లక్ష్మి, సిద్ధాంతపు సత్యవతి, పలివెల రాణి, వాసా వినాయకరావు తదితరులు టీడీపీ నుంచి చేరారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో మత్స్యకారులు

కాకినాడ: కాకినాడ 12వ డివిజన్ పర్లోపేటలోని వాడపేటకు చెందిన మత్స్యకారులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. డివిజన్ నాయకులు బొదిరెడ్ల పుష్ప పరశురామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంతో కాలంగా టీడీపీలోను, మరికొందరు జనసేనలోను క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశంలో క్రియాశీలకంగా పనిచేసే రాగితి సత్తిబాబు, చోడిపల్లి కొర్లయ్య, దూడ తాతారావుతో పాటు సుమారు 50 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరు రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా మరింత కష్టించి పనిచేయాలని సూచించారు. రానున్న 12 రోజులు అత్యంత కీలకమని, బూత్‌స్థాయి నుంచి పార్టీ విజయమే లక్ష్యంగా శ్రమించాలని ఆయన సూచించారు.